సాక్షి
సంగారెడ్డి
శుక్రవారం । 13 । జూన్ । 2025

బడిగంట మోగడంతో లోపలికి వెళ్తున్న విద్యార్థులు



ఇంటికి వెళ్తాం అని మారాం చేస్తున్న చిన్నారి



మోగింది బడి గంట



సంగారెడ్డిలో పాఠశాలకు వస్తున్న విద్యార్థులు

దాదాపు నెలన్నర రోజుల వేసవి సెలవులు ముగియడంతో రాష్ట్రవ్యాప్తంగా బడులు గురువారం పునఃప్రారంభమయ్యాయి. బడిగంటలు మోగడంతో విద్యార్థులు బడిబాట పట్టారు. తమతో కలిసి చదివిన స్నేహితులను కలుసుకున్నారు. ఒకరికొకరు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గురువులకు పాదాభివందనం చేశారు. తొలిరోజు కావటంతో పాఠశాలలకు తోరణాలు కట్టి విద్యార్థులను టీచర్లు ఆహ్వానించారు. చిన్న పిల్లలు మాత్రం పాఠశాలకు రావడానికి అయిష్టం వ్యక్తం చేశారు. కొందరు ఆడుతూ కనిపించారు. మరి కొందరు ఇంటికి వెళ్తామని మారాం చేశారు. బడులు తెరిచిన రోజే జిల్లా వ్యాప్తంగా పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలను ఉపాధ్యాయులు అందజేశారు. అందోల్ మండలం నేరుడుగుంట ప్రభుత్వ పాఠశాలలో కలెక్టర్ వల్లూరు క్రాంతి విద్యార్థులు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు.

సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి



జోగిపేట: విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న కలెక్టర్ క్రాంతి

న్యూస్‌రీల్

నేడు ఇందిరమ్మ ఇళ్ల పనులకు భూమిపూజ

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని తడ్కల్, ఎడ్లరేగడితండా గ్రామపంచాయతీల పరిధిలో ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి శుక్రవారం భూమి పూజ చేయనున్నారు. అనంతరం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేయనున్నారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే భూమి పూజ కార్యక్రమానికి సంబంధిత అధికారులు, లబ్ధిదారులు, స్థానిక పెద్దలు పాల్గొనాలని ఎంపీడీఓ సత్తయ్య గురువారం ఓ ప్రకటనలో కోరారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు భూమి పూజలు చేస్తున్న చంద్రశేఖర్

కంది(సంగారెడ్డి): రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ స్పష్టం చేశారు. మండల పరిధిలోని బేగంపేటలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి గురువారం ఆయన భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ప్రభుత్వం సూచించిన కొలతలు, నియమాలను పాటించి ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. నిర్మాణాలు చేసుకుంటున్న వారందరికీ విడతలవారీగా బిల్లులు చెల్లిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ మహేందర్ రెడ్డి, హౌసింగ్ డీఈ మాధవరెడ్డి, ఏఈ మేఘనాథ్, తాజా మాజీ ఉపసర్పంచ్ మహేష్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి తారాబాయి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సుందరమ్మ తల్లి జాతరలో సునీతారెడ్డి



హత్నూర జాతర ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

హత్నూర(సంగారెడ్డి): మండల కేంద్రమైన హత్నూరలో మూడురోజుల నుంచి జరుగుతున్న సుందరమ్మ తల్లి జాతర ముగింపు ఉత్సవాల్లో ఎమ్మెల్యే సునీతారెడ్డి గురువారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, నాయకులు రవి, శివశంకర్ ,రాజుగౌడ్, మేరాజ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌లు ఇవ్వాలి

సంగారెడ్డి ఎడ్యుకేషన్: పెంచిన విద్యార్థుల ఆర్టీసీ బస్‌పాస్ చార్జీలను వెంటనే తగ్గించడంతోపాటు విద్యార్థులందరికీ ఉచిత బస్‌పాస్ సౌకర్యం కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజేశ్ డిమాండ్ చేశారు. విద్యార్థుల బస్‌పాస్ చార్జీలపెంపునకు వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని న్యూ బస్టాండ్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్ మాట్లాడుతూ..ఇప్పటికే విద్యార్థులు బస్‌పాస్ చార్జీలు కట్టలేక చాలా మంది విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బస్‌పాస్ చార్జీలను తగ్గించాలని లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి అర్జున్, ఎస్ఎఫ్ఐ నాయకులు రజినీకాంత్, రవి, కృష్ణ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

20లోగా రైతు భరోసా దరఖాస్తు చేసుకోవాలి

జహీరాబాద్ టౌన్: రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సహాయం కోసం కొత్త రైతులు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ శాఖ జహీరాబాద్ ఏడీఏ భిక్షపతి పేర్కొన్నారు. జూన్ 5 నాటికి వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్ పూర్తయి, పట్టపాస్ పుస్తకం పొందిన వారు ఈ సీజన్‌కు అర్హులని స్పష్టం చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ...జిల్లాలో 1,200 మంది పాస్ పుస్తకాలు వచ్చిన కొత్త రైతులున్నట్లు చెప్పారు. కొత్త రైతులే కాకుండా భూమి ఉండి గతంలో ఎన్నడూ రైతు బంధు సాయం పొందని రైతులు కూడా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. భూమి పట్టా పాస్‌బుక్, రైతు ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ పుస్తకం జిరాక్స్ కాపీలతో దరఖాస్తులను వ్యవసాయ విస్తీర్ణ అధికారులకు అందజేయాలని కోరారు.

వ్యర్థజలాలతో విధ్వంసమే

వర్షం నీటిలో వదలొద్దని పరిశ్రమలకు పీసీబీ తాఖీదులు

- సాల్వేంట్ రికవరీ, షుగర్ డిస్టిలరీలకు సైతం!
- ఉల్లంఘిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరికలు
- పీసీబీవి నామ మాత్రపు చర్యలేనంటున్న ప్రజలు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: పరిశ్రమల్లో ఉత్పత్తి అయిన హానికరమైన రసాయన వ్యర్థ జలాలను వాననీటిలోకి వదిలేయడం జిల్లాలో పరిపాటైపోయింది. ఫలితంగా చెరువులు, కాలువలు కలుషితమై పశుపక్ష్యాదులు మృత్యువాత పడుతున్నాయి. ఇక వ్యర్థ జలాలు భూమిలోకి ఇంకిపోయి భూగర్భ జలాలు సైతం కలుషితమై మానవాళికీ ముప్పుగా పరిణమిస్తోంది. ఇప్పుడు వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) జిల్లాలో సంబంధిత పరిశ్రమలకు నోటీసులు జారీ చేసింది. ఫార్మాస్యూటికల్, సాల్వేంట్ రికవరీ, కెమికల్, బల్క్‌డ్రగ్, బ్రూవరీ, షుగర్, డిస్టిలరీలకు ఈ తాఖీదులు ఇస్తోంది. ఇలా జిల్లావ్యాప్తంగా 120కి పైగా పరిశ్రమలకు ఈ ముందస్తు నోటీసులు వెళ్లాయి. ప్రధానంగా జిన్నారం మండలం గడ్డపోతారం, బొంతపల్లి పారిశ్రామిక వాడల్లోని పరిశ్రమలతోపాటు, పటాన్‌చెరు మండలం పాశమైలారం, సంగారెడ్డి, హత్నూర మండలం గుండ్లమాచనూరు, కొండాపూర్, సదాశివపేట మండలాల్లోని ఆయా కేటగిరీలకు చెందిన పరిశ్రమలు ఈ నోటీసులు వెళ్లాయి.



గడ్డపోతారంలో ఓ పరిశ్రమ నుంచి వదులుతున్న రసాయన వ్యర్థాలు. (ఫైల్‌ఫొటో)

జిల్లాలోని రెడ్ కేటగిరీకి చెందిన పరిశ్రమలు సుమారు రెండు వేల వరకు ఉంటాయి. ఇందులో చాలా పరిశ్రమలు కాలుష్య నియంత్రణకు సంబంధించిన కనీస ప్రమాణాలు పాటించడం లేదు. ఆయా పరిశ్రమల్లో నిత్యం ఉత్పత్తి అయ్యే హానికరమైన రసాయన వ్యర్థాలను నిల్వ చేస్తుంటాయి. వర్షకాలం రాగానే వర్షపునీటిలో వదిలేస్తుండటం పరిపాటిగా మారింది. వర్షాలు కురుస్తున్న రాత్రివేళల్లో ఈ హానికరమైన రసాయన వ్యర్థాలను పరిశ్రమల నుంచి బయటకు వదిలేస్తుంటాయి. కాలకూట విషంతో సమానమైన ఈ హానికరమైన రసాయన వ్యర్థాలు వర్షం నీటిలో కలిసి సమీపంలో చెరువులు, కుంటల్లోకి చేరుతోంది. వర్షం నీటితోపాటు చాలా మట్టుకు భూగర్భంలోకి ఇంకి పోతున్నాయి. దీంతో చెరువులు కుంటలు కాలుష్య కాసారాలుగా మారడంతో పాటు, భూగర్భ జలాలు కూడా పూర్తిగా కలుషితమవుతున్నాయి. ఈ నీటిని తాగే పశుపక్ష్యాదులు మృత్యువాత పడటం, చెరువుల్లోని చేపలు మృతి చెందడం పరిపాటైపోయింది. ఇలా వర్షాకాలం వస్తే చాలు జలకాలుష్యం తీవ్రరూపం దాల్చుతోంది.

మొక్కుబడి నోటీసులేనా..?

జిల్లాలో రెడ్ కేటగిరీ పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యంతో జరుగుతున్న జీవన విధ్వంసం అంతా ఇంతా కాదు. ఆర్థిక, రాజకీయ, అంగబలం ఉన్న ఈ పరిశ్రమల యాజమాన్యాల ఆగడాలపై స్థానికులు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు మొక్కుబడి చర్యలతోనే సరిపెడుతున్నారు. ఇలా పరిశ్రమలకు నోటీసులు ఇవ్వడం పరిపాటేనని, ఆయా పరిశ్రమలు ఇలా రసాయన వ్యర్థ జలాలను వదలడం కూడా సాధారణమేనని బాధితులుగా మారుతున్న స్థానికులు వాపోతున్నారు. కాలుష్యంపై పీసీబీకి ఏటా వందల సంఖ్యలో ఫిర్యాదులు అందినా మొక్కుబడి చర్యలు తీసుకోవడం పరిపాటే. నోటీసులు అంటూ..శాంపిళ్ల సేకరణ.. వంటి నామమాత్ర చర్యలతో సరిపెడుతున్న పీసీబీ అధికారులు తప్పనిసరి పరిస్థితుల్లో మొక్కుబడిగా ఆయా పరిశ్రమలు ఇచ్చే రూ.లక్ష, రూ.రెండు లక్షల బ్యాంకు గ్యారంటీలను జప్తు చేయడం వంటి చర్యలతోనే సరిపెడుతున్నారు. అలాగే మొక్కుబడి జరిమానాలు విధించి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో ఈ పరిశ్రమల ఆగడాలు ఏటా వర్షాకాలం యథేచ్ఛగా సాగుతున్నాయి. ఇప్పుడు ముందస్తుగా ఇస్తున్న తాఖీదులు కూడా మొక్కుబడి తంతనే అభిప్రాయం బాధితుల్లో వ్యక్తమవుతోంది.

జిల్లా కలెక్టర్‌గా పి.ప్రావీణ్య

- వల్లూరు క్రాంతి టూరిజం కార్పొరేషన్‌కు బదిలీ
- ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పి.ప్రావీణ్య నియమితులయ్యారు. హన్మకొండ జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న ప్రావీణ్యను ఇక్కడికి బదిలీ చేశారు. సంగారెడ్డి కలెక్టర్‌గా పనిచేస్తున్న వల్లూరు క్రాంతి బదిలీ అయ్యారు. ఆమెను తెలంగాణ పర్యాటకాభివృద్ధి కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల రాష్ట్ర ఉన్నతాధికారులను మూకుమ్మడి బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులోభాగంగా సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతికి బదిలీ అయింది. 2024 జనవరి 4న కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన క్రాంతి జిల్లాలో సుమారు 17 నెలలు పనిచేశారు.

మహిళా సాధికారతకు ప్రాధాన్యత

ప్రధానంగా మహిళా సాధికారతకు ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చారు. ప్రధానంగా ఎస్‌హెచ్‌జీ (స్వయం సహాయక సంఘాల) మహిళలు స్వావలంబన సాధించే దిశగా వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా డ్రోన్ దీదీ పథకం అమలు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. ప్రధాని నరేంద్రమోదీ ఇటీవల నిర్వహించిన 'మన్‌కీ బాత్'లో ఈ డ్రోన్ మహిళల పథకాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఎస్‌హెచ్‌జీ మహిళలు డ్రోన్ ఆపరేటర్లుగా శిక్షణ తీసుకుని ఈ డ్రోన్‌ల సహాయంతో వ్యవసాయ పనులను చేస్తున్నారు. అలాగే మహిళలకు కారు డ్రైవింగ్‌లో శిక్షణ ఇప్పించారు. పురుషులకు ఏమాత్రం తీసిపోని విధంగా ట్యాక్సీలు నడిపేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. జిల్లా కేంద్రంలో ఎస్‌హెచ్‌జీ మహిళలతోనే పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేయించారు. ఈ బంక్‌ను ఇటీవలే ట్రయిల్ రన్ జరుగుతోంది. త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ బంక్‌ను అధికారికంగా ప్రారంభించనున్నారు.

ప్రొఫైల్



పి.ప్రావీణ్య

పి.ప్రావీణ్య 2016 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. సివిల్స్‌లో 82వ ర్యాంక్ సాధించారు. రెండో ప్రయత్నంలోనే అఖిల భారత సర్వీసుకు ఎంపికయ్యారు. ముందుగా కర్ణాటక కేడర్ అధికారిగా నియమితులు కాగా, తర్వాత తెలంగాణకు బదిలీ అయ్యారు. హన్మకొండ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆమె గతంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా, జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌గా పని చేశారు. కరీంనగర్ ట్రైనీ కలెక్టర్‌గా కూడా పని చేశారు. ఆమె విద్యాభ్యాసం బెంగళూరులో సాగినట్లు సమాచారం.

పాలనపై తనదైన ముద్ర..

కలెక్టర్ క్రాంతి జిల్లా పాలనపైనా తనదైన ముద్ర వేశారు. తరచూ సమీక్షలు, క్షేత్రస్థాయి పర్యటనలతో జిల్లా అధికార యంత్రాంగాన్ని ముందుకు నడిపించారు. ప్రధానంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు చేసేందుకు క్షేత్రస్థాయి పర్యటనలు చేశారు. ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి వంటి ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించారు. అలాగే నిరుపేదలు విద్యనభ్యసించే ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ స్కూల్‌లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. గతేడాది జరిగిన పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించడంలో కలెక్టర్ క్రాంతి సఫలీకృతులయ్యారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి రిటర్నింగ్ అధికారిగా కూడా వ్యవహరించారు.

గడువులోగా ఇందిరమ్మ ఇళ్లు పూర్తి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: ఇందిరమ్మ ఇళ్లను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పొంది...వాటిని వినియోగించని వారి స్థానంలో అర్హులైన లబ్ధిదారులకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లపై గురువారం వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలలో తొలి విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులందరూ నిర్మించుకునేలా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఏర్పడితే పరిష్కరించేలా వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. నోటరీ పేరుతో లబ్ధిదారులు తమ ఇళ్లను విక్రయించినట్లు విచారణలో తేలితే వెంటనే రద్దు చేయాలని ఆదేశించారు. స్థానిక కోట కింద మిగిలిన ఇళ్లను సైతం అర్హులైన లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అదే విధంగా నియోజకవర్గ పరిధిలో నిర్మాణ దశలో ఉన్న 5500 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను వెంటనే పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ ఎండీ గౌతమ్‌కు ఎమ్మెల్యే ఫోన్‌లో సూచించారు. కొల్లూరు, ఉస్మాన్ నగర్, అమీన్‌పూర్, కర్దనూర్, నాగులపల్లి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయంలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. వ్యాపార సముదాయాలోని దుకాణాలను నోటిఫికేషన్ ద్వారా మాత్రమే కేటాయించాలని సూచించారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ అధికారులు నరసయ్య, పీడీ చలపతి రావు, డీఈ రవీందర్, ఆయా మండలాల తహసీల్దారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మహిపాల్ రెడ్డి

ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా వివేక్



మంత్రి వివేక్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా వివేక్ వెంకటస్వామి నియమితులయ్యారు. ఇప్పటివరకు జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా వ్యవహరించిన కొండా సురేఖ స్థానంలో వివేక్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తాజా రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో ఆయనకు అమాత్య పదవి దక్కిన సంగతి తెలిసిందే.

మంత్రిని కలిసిన దళిత సంఘాల నాయకులు

జహీరాబాద్ టౌన్: రాష్ట్ర కార్మిక గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్‌ను జహీరాబాద్ దళిత సంఘాల నాయకులు హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో గురువారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

అందోలులోనే నవోదయ పాఠశాల

- ఉన్నతాధికారుల నుంచి లభించిన అనుమతులు
- స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్

జోగిపేట(అందోల్): జవహర్ నవోదయ పాఠశాల అందోలులో ఏర్పాటుకు ఉన్నతాధికారుల నుంచి అనుమతులు లభించాయి. జిల్లాకు మంజూరైన పాఠశాల ఎక్కడ ఏర్పాటు చేస్తారనే విషయం స్థానికంగా చర్చనీయాంశమైన నేపథ్యంలో గురువారం కలెక్టర్ వల్లూరు క్రాంతి అందోలులోని సర్వేనంబరులోని 1141లోని 30 ఎకరాల స్థలాన్ని ఆర్డీఓతో కలిసి పరిశీలించారు. దీంతో దాదాపు అందోలులోనే నవోద పాఠశాల నిర్మాణం చేపడుతున్నట్లు స్పష్టమైంది. ఈ స్థలాన్ని నవోదయ విద్యాసంస్థలకు చెందిన ఉన్నతాధికారులు ముందుగానే పరిశీలించి ఓకే చెప్పినట్లు తెలుస్తోంది.

పూర్తి నివేదికకు కలెక్టర్ ఆదేశం

అందోలు వద్ద ఉన్న 1141 సర్వే నంబరులోని స్థలాన్ని జిల్లా కలెక్టర్ గురువారం పరిశీలించి పూర్తి నివేదికను తయారు చేసి పంపాలని ఆర్డీఓ పాండు, ఇతర రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ స్థలంలో గతంలో ఎవరికైనా కేటాయించారా? వంటి విషయాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ స్థలంలో చేపడుతున్న నిర్మాణ వివరాలను డిప్యూటీ తహసీల్దారు మధుకర్‌రెడ్డి మ్యాపు ద్వారా కలెక్టర్‌కు వివరించారు. నవోదయ విద్యా సంస్థల వారు కూడా ఈ స్థలానికి ఆమోదం తెలిపినట్లు తెలిపారు. దీని ప్రక్కనే 150 పడకల ఆస్పత్రి, నర్సింగ్ కళాశాల నిర్మాణం కూడా చేపడుతున్నట్లు వివరించారు.



స్థల వివరాలను కలెక్టర్‌కు వివరిస్తున్న ఆర్డీఓ

'ప్రైవేట్' ఫీజుల దోపిడీని అరికట్టాలి



ధర్నా చేస్తున్న యూఎస్ఎఫ్ఐ నాయకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: జిల్లాలో ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు అధిక ఫీజులను నిరసిస్తూ గురువారం సంగారెడ్డిలోని జిల్లా విద్యాధికారి కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ...జిల్లాలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చి విద్యను వ్యాపారమయం చేశారన్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి విద్యా చట్టాన్ని అమలు చేయకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న తీరుపై మండిపడ్డారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి తప్పుడు ప్రచారాలు చేస్తూ లాభార్జనే తమ ధ్యేయంగా ప్రైవేట్ విద్యావ్యవస్థ కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పుస్తకాలు, దుస్తులు కూడా విద్యాసంస్థల్లో పెట్టి వ్యాపారం కొనసాగిస్తుంటే విద్యాధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. గుర్తింపులేని ప్రైవేటు విద్యాసంస్థలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాణిక్యం

25 శాతం సీట్లు ఉచితంగా ఇవ్వాలి: కేవీపీఎస్

పేద విద్యార్థులకు కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థల్లో 25 శాతం సీట్లను ఉచితంగా ఇవ్వాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం డిమాండ్ చేశారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి (కేవీపీఎస్) ఆధ్వర్యంలో గురువారం సంగారెడ్డిలోని ఆ సంఘం కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తూ దోపిడీ పాల్పడుతున్నాయని మండిపడ్డారు.

బాల భరోసాకు శ్రీకారం

చిన్నారుల ఆరోగ్య సంరక్షణే లక్ష్యం

- ఐదేళ్లలోపు చిన్నారులకు వైద్య పరీక్షలు
- పథకం అమలుకు ప్రత్యేక చర్యలు

సంగారెడ్డి జోన్: చిన్నారుల ఆరోగ్య సంరక్షణ ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టనుంది. త్వరలో అంగన్‌వాడీ కేంద్రాల్లో బాల భరోసా పథకాన్ని అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటుంది. ఇప్పటికే కేంద్రాలలోని బాలింతలు, గర్భవతులు, చిన్నారులకు సేవలు అందిస్తుండగా బాల భరోసా పథకం కింద వైద్య పరీక్షలను కూడా చేపట్టనుంది. పథకం అమలుకు మార్గదర్శకాలను అధికారులు రూపొందిస్తుంది. ప్రతీ ఏటా అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణమాసం నిర్వహించి పోషకాహార విలువలు, పౌష్టికాహారంపై తగిన సూచనలు సలహాలు అందిస్తున్నారు. పౌష్టికాహారలోపం ఉన్న చిన్నారులను గుర్తించి, వారికి అనుబంధ పోషకాహారాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

బాల భరోసాతో చిన్నారుల సంరక్షణ

ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం పలు రకాల చర్యలు తీసుకుంటుంది. గర్భవతులు, బాలింతలు, చిన్నారులకు గుడ్లు, పాలు, పౌష్టికాహారం, బాలామృతం పంపిణీ చేస్తున్నారు. చిన్నారులకు నెలవారి ఇంజక్షన్లు అందిస్తున్నారు. చిన్నారి బరువు, ఎత్తులను పరిశీలించి ఎదుగుదలకు అవసరమయ్యేలా చర్యలు తీసుకుంటుంది. బాల భరోసా పథకం ద్వారా ఐదేళ్లలోపు చిన్నారులకు ఉచిత వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహించనుంది. ఆరోగ్య పరీక్షలలో ఏమైనా లోపాలు, ఆరోగ్య సమస్యలు ఉంటే చికిత్స నిమిత్తం పెద్ద ఆస్పత్రులకు పంపించి ఉచిత వైద్యాన్ని అందించనున్నారు.



జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన విద్యార్థుల వివరాలు

ప్రాజెక్టు పేరు	0-5సం.లోపు ఉన్న చిన్నారులు
జోగిపేట	13,086
నారాయణఖేడ్	16,690
పటాన్‌చెరు	21,707
సదాశివపేట	16,455
జహీరాబాద్	27,337

జిల్లాలో 1504 అంగన్‌వాడీ కేంద్రాలు

జిల్లాలో ఐదు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉండగా, వాటి పరిధిలో 1,504 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఆయా కేంద్రాల్లో సుమారు 93వేల మంది చిన్నారులు ఉంటారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న ఈ పథకంతో చిన్నారుల ఆరోగ్యం మెరుగుపడి సత్ఫలితాలు వచ్చే అవకాశాలు ఉంటాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

గ్రామాల్లో సర్వే జరుగుతోంది



ఇప్పటికే మహిళా శిశు సంక్షేమశాఖ ద్వారా సర్వే చేసి ఐదేళ్లలోపు పిల్లలను గుర్తిస్తున్నాం. గ్రామాల్లో ఈ సర్వే కొనసాగుతోంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే బాల భరోసా పథకాన్ని అమలు చేస్తాం.

లలిత కుమారి, జిల్లా సంక్షేమశాఖ అధికారి, సంగారెడ్డి

క్లుప్తంగా

పోక్సో కేసులో నేరస్తుడికి పదేళ్ల జైలు

మెదక్ మున్సిపాలిటీ : బాలికపై లైంగికదాడికి పాల్పడిన వ్యక్తికి న్యాయస్థానం జైలు శిక్ష, జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు గురువారం తెలిపారు. రామాయంపేటకు చెందిన రొయ్యల రాజు(35) 2009 ఆగస్టు 27న వినాయక మండపం వద్ద ప్రసాదం తీసుకొని వెళ్తున్న ఆరేళ్ల బాలికను పాతాళాల చూపించడానికి రమ్మని తీసుకెళ్లాడు. అక్కడికి తీసుకెళ్లిన తరువాత బాలిక నోట్లో బట్టలు కుక్కి లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక కుటుంబీకుల ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ విజయ్‌కుమార్ పోక్సో కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. ప్రస్తుత సీఐ వెంకటరాజాగౌడ్ జిల్లా కోర్టులో నిందితుడిని, సాక్షులను ప్రవేశపెట్టారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ, నిందితుడు రొయ్యల రాజుకు పదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.వెయ్యి జరిమానా విధించింది. నేరస్తుడికి శిక్షపడేలా కృషి చేసిన పోలీసు అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

గంజాయి, మద్యం స్వాధీనం


మునిపల్లి(అందోల్): ఆర్టీసీ బస్సులో గంజాయి తీసుకొస్తున్న వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం... మండలంలోని కంకోల్ టోల్ ప్లాజా సమీపంలో వాహనాల తనిఖీ చేస్తుండగా కర్నాటకకు చెందిన ఆర్టీసీ బస్సులో మణి అనే వ్యక్తి దగ్గర 400 గ్రాముల ఎండు గంజాయి దొరికింది. దీంతో అతడిని అదుపులోకి తీసుకున్నామని జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు, స్టేషన్ టీం, సిబ్బంది హనుమంతు, అనుదీప్‌రెడ్డి తెలిపారు. అలాగే గోవా నుంచి అక్రమంగా 5,190 లీటర్ల సుంకం చెల్లించని మద్యం తరలిస్తున్న వ్యక్తిని స్టేషన్‌కు తరలించారు. మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం


శివకుమార్

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన చిలప్‌చెడ్ మండలం గంగారం గ్రామంలో జరిగింది. ఎస్ఐ నర్సిహులు వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన మంగలి శివకుమార్‌కు నెల రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నెల 10న ఆస్పత్రికి వెళ్లి వచ్చాడు. 11న ఉదయం భోజనం చేసి ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబసభ్యులు ఫోన్ చేస్తే స్విచ్ఆఫ్ వచ్చింది. చుట్టు ప్రక్కల, బంధువుల వద్ద ఆరా తీయగా ఆచూకీ లభించలేదు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కూతురు కనిపించడం లేదని తండ్రి ఆత్మహత్య


దుర్గయ్య

టేక్మాల్(మెదక్): కూతురు కనిపించకపోవడంతో మనస్తాపం చెందిన తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన టేక్మాల్‌లో గురువారం చోటుచేసుకుంది. స్థానిక ఏఎస్సై కృష్ణ వివరాల ప్రకారం.. గ్రామానికి ఈర్నాల దుర్గయ్య (40) కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. చిన్న కూతురు భాను ఊర్లోనే ఉంటూ చదువుకుంటోంది. ఈ నెల 7న మృగశిర కార్తె సందర్భంగా దుర్గయ్య గ్రామానికి వచ్చాడు. బుధవారం మధ్యాహ్నం నుంచి భాను కనిపించలేదు. వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో మనస్తాపానికి గురైన దుర్గయ్య ఇంట్లోనే ఉరి వేసుకున్నాడు.

చికిత్స పొందుతూ గృహిణి మృతి

నర్సాపూర్ రూరల్: చికిత్స పొందుతూ గృహిణి మృతి చెందింది. ఎస్సై లింగం కథనం ప్రకారం... మండలంలోని మూసాపేట గ్రామానికి చెందిన ఆలంపల్లి సంధ్య (26) మానసిక వ్యాధితో బాధపడుతూ మందులు వాడుతుంది. ఈనెల 10న తాను వాడే మందులతో పాటు భర్త గిరి వాడే మూర్ఛ వ్యాధి మందులు అనుకోకుండా మింగింది. దీంతో ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లింది. కుటుంబ సభ్యులు ఆమెను నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ గాంధీకి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది.

ఎట్టకేలకు డీఎస్ఆర్ అమలు

- గత నెల 24నుంచి అందుబాటులోకి
- ఫేస్ రికగ్నైషన్‌తో కార్యదర్శుల హాజరు
- పారదర్శక పాలన అమలుకు చర్యలు

మొదట యాప్‌ను నిరాకరించిన పంచాయతీ కార్యదర్శులు





సంగారెడ్డి జోన్: గ్రామ పంచాయతీల్లో పాలన పారదర్శకంగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రోజువారీ పారిశుద్ధ్య నివేదిక (డీఎస్ఆర్- డైలీ శానిటేషన్ రిపోర్టు) యాప్‌ను తీసుకొచ్చింది. ఈ యాప్‌లో వివరాలు అప్‌డేట్ చేసేందుకు దూరంగా ఉన్న పంచాయతీ కార్యదర్శులు ఎట్టకేలకు అమలు చేసేందుకు సిద్ధమయ్యారు. గత నెల 24న ఈ విధానంను అమలులోకి తెచ్చినా ఇప్పటి వరకు వివరాలు నమోదు చేయలేదు. జిల్లాలో వివరాలు నమోదు చేస్తున్న వారు చాలా తక్కువ సంఖ్యలో ఉన్నారు. ఇప్పటి కే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, ఏ శాఖలో లేని విధంగా తమకు ఫేస్ రికగ్నైషన్ యాప్ ఎందుకని పంచాయతీ కార్యదర్శులు ప్రశ్నిస్తున్నారు.

కొత్త మార్గదర్శకాలతో రూపకల్పన

గత ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శుల్లో పారదర్శకతను పెంచేందుకు ఈ యాప్‌ను రూపొందించింది. అందులో ఉన్న మార్గదర్శకాలతో పలువురు పంచాయతీ కార్యదర్శులు సమయపాలన పాటించకపోవటంతో పాటు విధులకు గైర్హాజరవుతున్నట్లు గుర్తించారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం యాప్‌లో పలు మార్పులు చేస్తూ ఫేస్ రికగ్నైషన్‌తో హాజరుతో పాటు ఇతర వివరాలను నమోదు చేయాలని ఉత్వర్వుల్లో పేర్కొన్నది. ప్రతి రోజు సంబంధిత కార్యాలయానికి వెళ్లి ఫొటోతో ఫేస్ రికగ్నైషన్‌తో హాజరు వేయాల్సి ఉంటుంది. అంతే కాకుండా సేకరించిన చెత్త వివరాలను తూకం వేసి, ఎన్ని కేజీలు ఉందో వివరాలు అప్‌లోడ్ చేయాలని నిర్ణయించింది. ప్రభుత్వం జారీ చేసిన కొత్త మార్గదర్శకాలను అమలు చేసేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

అంగీకరించని కార్యదర్శులు

ప్రభుత్వం తీసుకువచ్చిన యాప్‌ను మొదట పంచాయతీ కార్యదర్శులు వ్యతిరేకించారు. తెలంగాణ పంచాయతీ సెక్రటరీల అసోసియేషన్, తెలంగాణ పంచాయతీ సెక్రటరీ సెంట్రల్ ఫోరం, తెలంగాణ పంచాయతీ సెక్రటరీల ఫోరం.. ఈ మూడు సంఘాలు జేఏసీగా ఏర్పడి యాప్‌కు వ్యతిరేకంగా పోరుబాట చేపట్టారు. ఇప్పటికే తమ ఫోన్లలో ఇందిరమ్మ ఇళ్లు, స్వచ్ఛ భారత్, మిషన్ భగీరథ, ఆహారభద్రత కార్డులతో పాటు తదితర వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నామని తెలిపారు. కొత్తగా వచ్చిన యాప్‌తో మరింత భారం అవుతుందని పంచాయతీ కార్యదర్శులు పేర్కొంటున్నారు.

జిల్లాలో 631 గ్రామ పంచాయతీలు

జిల్లాలోని 26 మండలాల్లో 631 గ్రామ పంచాయతీల్లో 631 మంది కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నారు. అయితే ఇటీవల మెరుగైన పారిశుద్ధ్యానికి జోన్‌లను ఆయా గ్రామాల్లో ఇండ్ల సంఖ్య, జనినివాసం, మార్కెట్లు, ఇనిస్టిట్యూషన్, వ్యాపార సంస్థల ఆధారంగా జోన్‌లను ఏర్పాటు చేశారు. ప్రతి గ్రామపంచాయతీలో రెండు నుంచి ఆరు వరకు విభజించారు. ఈ మేరకు 1464 జోన్‌లను ఏర్పాటు చేశారు. యాప్ వినియోగం ద్వారా జిల్లాలో బుధవారం వరకు 15 గ్రామ పంచాయతీల్లో మాత్రమే అమలైంది. మిగితా 616 గ్రామ పంచాయతీలు అమలుకు దూరంగా ఉన్నాయి. గురువారం జిల్లా అంతటా యాప్ అమలు ప్రారంభమైంది. మొదటి రోజు జిల్లా అంతటా ఫేస్ రికగ్నైషన్ యాప్ ద్వారా హాజరు వేశారు. మిగితా వివరాలు సైతం నమోదు చేయనున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

మోదీ పాలన స్వర్ణయుగం

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ

మెదక్‌జోన్: ప్రధాని మోదీ పదకొండేండ్ల పాలన స్వర్ణయుగమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, నిజామాబాద్ మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. గురువారం మెదక్ బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ 6 దశాబ్దాల పాటు దేశాన్ని పాలించి చేసిందేమి లేదని విమర్శించారు. మహిళలు, విద్యార్థులు, యువకుల అభివృద్ధి కోసం మోదీ ప్రత్యేకంగా సంక్షేమ పథకాలు తీసుకొచ్చారన్నారు. రోడ్లు, వాయుమార్గాలు, వందేభారత్ రైళ్లతో పాటు దేశ భద్రత విషయంలో ప్రపంచ దేశాలకు తెలిసి వచ్చేలా భారత్ సత్తాను ఆపరేషన్ సిందూర్ ద్వారా చూపించాడన్నారు. రైతు అభివృద్ధే ధ్యేయంగా రైతు పండించిన ఉత్పత్తులకు మద్దతు ధర, పెట్టుబడుల కోసం కిసాన్‌సమ్మాన్ నిధి అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశంగౌడ్, మాజీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, మేడ్చల్ జిల్లా మాజీ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, స్థానిక నేతలు ఎంఎల్ఎన్ రెడ్డి, సుభాష్‌గౌడ్, సత్యనారాయణ, రాములు, సతీష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మోటార్ల దొంగలు అరెస్ట్

కేసును ఛేదించిన రేగోడ్ పోలీసులు


కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ రేణుకా రెడ్డి

రేగోడ్(మెదక్): వ్యవసాయ బావుల వద్ద బోరు మోటార్లను దొంగిలిస్తున్న నిందితులను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అల్లాదుర్గం సీఐ రేణుకా రెడ్డి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రేగోడ్ మండలంలోని పెద్దతండాకు చెందిన వడ్త్యా కిషన్ నాయక్, హరిజా నాయక్ నెల క్రితం ఆయా గ్రామాల్లో వ్యవసాయ బోరు మోటార్లను దొంగిలించారు. వాటికి ఉండే స్టాండ్‌లను కూడా ఎత్తుకెళ్లారు. అయితే కొండాపూర్ గ్రామానికి చెందిన పట్లోళ్ల శ్రీకాంత్ ఫిర్యాదుతో పాటు మొత్తం ఐదు కేసులు నమోదయ్యాయి. ఏఎస్ఐ శంకర్, కానిస్టేబుళ్లు వినోద్, సురేశ్, సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి కేసును ఛేదించారు. రూ.70 వేల విలువైన ఐదు మోటార్లు, రెండు స్టాండ్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టుకు తరలించారు. ఏఎస్ఐ శంకర్, సిబ్బందిని సీఐ అభినందించారు.

ఆరెగూడెం చోరీ కేసులో..

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని ఆరెగూడెంలో వారం రోజుల క్రితం జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఎస్సై రాజు వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన హనుమాద్రి లక్ష్మాగౌడ్ ఇంట్లో ఈ నెల 5న చోరీ జరిగింది. ఇంటి తాళాలు పగులగొట్టి చెక్కపెట్టెలో దాచిన రూ.90 వేలు నగదును అపహరించారు. ఘటనపై ఫిర్యాదు అందుకున్న పోలీసులు దర్యాప్తులో భాగంగా అదే గ్రామానికి చెందిన నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించగా చోరీ చేసినట్లు అంగీకరించాడు. దొంగిలించిన సొత్తులో ఖర్చుపెట్టుకోగా మిగిలిన రూ.23 వేలు నగదు, ఒక సెల్‌ఫోన్, దొంగతనానికి ఉపయోగించిన ఇనుప పైపును స్వాధీనం చేసుకున్నారు. గురువారం కోర్టులో హాజరుపరచగా జ్యుడీషియల్ కస్టడీ విధించినట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

అదనపు కలెక్టర్ నగేశ్


ఉపాధ్యాయుడి కుమారుడు అమర్త్యాకు అడ్మిషన్ ఇస్తున్న అదనపు కలెక్టర్

హవేళిఘణాపూర్(మెదక్): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అదనపు కలెక్టర్ నగేశ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని కూచన్‌పల్లి జడ్పీ హైస్కూల్‌ను సందర్శించి విద్యార్థులకు నోట్, పాఠ్య పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలు సరిగా అర్థం చేసుకొని బాగా చదువుకోవాలన్నారు. గ్రామంలో బడీడు పిల్లలందరూ కచ్చితంగా పాఠశాలలోనే ఉండాలన్నారు. ఎవరైనా రాకుండా ఉంటే వారిని గుర్తించి సమీపంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. తెలుగు ఉపాధ్యాయుడు శశికుమార్ తన కుమారుడికి, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న మరి కొంతమంది విద్యార్థులకు అదనపు కలెక్టర్ చేతుల మీదుగా అడ్మిషన్ తీసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవో మధుమోహన్, పాధ్యాయులు శివరాజ్, సుకన్య, శ్రీనివాస్, మల్లారెడ్డి ,సందీప్, సంతోషికుమారి, వినోద్, కొండల్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, రాజు, చక్రపాణి, కృష్ణవేణి , గంగమణి, సందీప్ రెడ్డి పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి

మునిపల్లి(అందోల్): రోడ్డు దాటుతున్న వ్యక్తిని పరిశ్రమ బస్సు ఢీకొట్టడంతో మృతి చెందాడు. బుదేరా ఎస్ఐ రాజేశ్ నాయక్ వివరాల ప్రకారం... పెద్దచల్మెడ గ్రామానికి చెందిన చాకలి దుర్గయ్య (60) గురువారం ఉదయం గ్రామంలో పత్తి పంటకు మందులు కొనుగోలు చేయడానికి రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో ఎంఆర్ఎఫ్ పరిశ్రమలో లీజుకు నడిపిస్తున్న వాసవీ ట్రాన్స్‌పోర్ట్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దుర్గయ్యకు బలమైన గాయాలు కావడంతో సదాశివపేట ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సంగారెడ్డిలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ దుర్గయ్య మృతి చెందాడు. మృతుడి కొడుకు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్..

కోహెడరూరల్(హుస్నాబాద్): వాహనం ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని శనిగరం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ అభిలాష్ వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ గాండ్ల లక్ష్మయ్య(56) గురువారం ఉదయం వాకింగ్ చేస్తుండగా అశోక్ లేలాండ్ వాహనం వెనక నుంచి వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్ తప్పిదం.. విద్యార్థి చదువుకు దూరం


విద్యార్థి అక్షిత

కొండాపూర్(సంగారెడ్డి): ఓ ఇంటర్నెట్ నిర్వాహకుడు చేసిన తప్పిదం కారణంగా విద్యార్థి చదువుకు దూరం కావాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి పూర్తి చేసి 544 మార్కులు సాధించినప్పటికీ ఆ విద్యార్థికి ఇంటర్ విద్య అందని ద్రాక్షలాగానే మిగిలిపోయేలా ఉంది. వివరాల్లోకి వెళ్తే .. కొండాపూర్ మండల పరిధిలోని కోనాపూర్ గ్రామానికి చెందిన కురాకుల అక్షిత అదే గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి వరకు చదివింది. ఇటీవలే విడుదలైన పది ఫలితాలలోనూ 544 మార్కులు సాధించింది. సోషల్ వెల్ఫేర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదవాలనుకుంది. దీంతో రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లిలోని ఓ ఇంటర్నెట్‌లో గురుకుల ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకుంది. సదరు ఇంటర్నెట్ నిర్వాహకుడు దరఖాస్తు ఫారం ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తున్న సమయంలో విద్యార్థి జెండర్ దగ్గర స్త్రీ కి బదులు పురుషుడు అని నమోదు చేశారు. ఆ అమ్మాయికి చిలుకూరులోని సోషల్ వెల్ఫేర్ బాలుర కళాశాలలో సీటు వచ్చింది. దీంతో ఏం చేయాలో అర్థం కాక విద్యార్థి తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారు.

అక్షిత తల్లిదండ్రులు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. ప్రైవేట్ కళాశాలలో చదివించే ఆర్థిక స్తోమత లేదు. అధికారులు స్పందించి సదరు వికారాబాద్ జిల్లాలో ఎక్కడైనా సోషల్ వెల్ఫేర్ బాలికల కళాశాలలో సీటు ఇప్పించాలని కోరుతున్నారు.

మహిళలకు తోడుగా సఖీ సెంటర్

సిద్దిపేటకమాన్: మహిళలకు తోడుగా సఖీ సెంటర్ సేవలు అందిస్తున్నామని సిద్దిపేట సెంటర్ అధికారి ప్రతిమ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో సఖీ సెంటర్ ఏర్పాటు చేసి ఆరేళ్లు పూర్తి చేసుకున్నదని తెలిపారు. ఈ కేంద్రం ద్వారా ఇప్పటి వరకు 1,535 కేసులు నమోదు కాగా వీటిలో 868 గృహ హింస, 111 వరకట్నం, 112 చీటింగ్ లవ్ కేసులు, 144 మిస్సింగ్, 58 పోక్సో, 23 బాల్య వివాహాలు, 219 ఇతర కేసులు నమోదయ్యాయని చెప్పారు. వీటిలో 1,387 కేసులు పూర్తి స్థాయిలో పరిష్కరించినట్లు చెప్పారు. 1,523 మందికి కౌన్సిలింగ్ నిర్వహించి మనోధైర్యం నింపినట్లు, మరో 148 కేసులు పరిశీలనలో ఉన్నాయన్నారు. 647 మందికి న్యాయ సలహాలు అందించడంతో పాటు 308 మందికి ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం, 197మందికి పోలీసు సపోర్టు ఇప్పించామని తెలిపారు. సెంటర్‌లో పూర్తి స్థాయి సిబ్బంది 24గంటలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

దొంగతనానికి వెళ్లి సెక్యూరిటీ గార్డు హత్య

- ఆరుగురు నిందితుల రిమాండ్
- పరారీలో ఇద్దరు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రభాకర్

పటాన్‌చెరుటౌన్: దొంగతనానికి వెళ్లి సెక్యూరిటీ గార్డును హత్య చేసిన నిందితుల్లో ఆరుగురిని పోలీసులు గురువారం అరెస్టు చేశారు. పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో డీఎస్పీ ప్రభాకర్ కేసు వివరాలు వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేటకు చెందిన కైరత్‌మియా (53) పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడలోని ఉష మాగ్ వైర్స్ ఇండియా ప్రయివేట్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తూ ఇస్నాపూర్‌లో ఉంటున్నాడు. అయితే బొంతపల్లికి చెందిన పెయింటర్లు బిట్టు, మహమ్మద్ మాజీద్, రోషన్ కుమార్, మహమ్మద్ సద్దాం, వికాస్ కుమార్, నర్సింగ రావు, వినీత్ కుమార్‌తో పాటు ఓ బాలుడు కలిసి పని చేసే చోట క్రికెట్ ఆడేవారు. ఈ నేపథ్యంలో పరిచయం ఏర్పడి మద్యం తాగుతూ జల్సాలకు అలవాటుపడ్డారు. పనిచేస్తే వచ్చే డబ్బులు జల్సాలకు సరిపోవడం లేదని, దొంగతనం చేద్దామని పతకం రచించారు. ఈ క్రమంలో ఏప్రిల్ 16న అర్ధరాత్రి ఉష మాగ్ వైర్స్ కంపెనీలో కాపర్ వైర్ దొంగిలించే ముందు మద్యం తాగారు. ప్లాన్ ప్రకారం బొలెరో వాహనం, నంబర్‌ప్లేట్ లేని ద్విచక్ర వాహనం తీసుకుని 8 మంది దొంగతనానికి వెళ్లారు. దొంగతనం చేస్తున్న క్రమంలో సెక్యూరిటీ గార్డు కైరత్ మియా గమనించి టార్చ్ వేసి చూశాడు. దీంతో అతడి తలపై కర్రలతో కొట్టడంతో గట్టిగా అరిచాడు. స్థానికంగా ఉన్న లేబర్ రావడంతో అక్కడి నుంచి అందరూ పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన సెక్యూరిటీ గార్డును పటాన్‌చెరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఏప్రిల్ 23న మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక పోలీసులు, సీసీఎస్ పోలీసులు దర్యాప్తులో భాగంగా మొబైల్ ఫోన్లు,. సీసీ కెమెరాలు పరిశీలించి రోషన్ కుమార్‌ని అదుపులోకి తీసుకొని విచారించగా నిందితుల వివరాలు వెల్లడించాడు. బాలుడు, బిట్టు అనే నిందితులు పరారు కాగా, మిగతా వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన వాహనం, సెల్‌ఫోన్‌లు, కర్రలను స్వాధీనం చేసుకున్నారు. కేసు ఛేదించిన సీసీఎస్ సీఐ శివకుమార్, బీడీఎల్ సీఐ స్వామి గౌడ్, సీసీఎస్ సీఐ -2 రామానాయుడు, ఎస్ఐలు శ్రీకాంత్, లక్ష్మారెడ్డి, మహేశ్వర్ రెడ్డి తోపాటు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

నీటికుంటలో వ్యక్తి మృతదేహం

ములుగు(గజ్వేల్): నీటి కుంటలో గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం కనిపించింది. ఈ ఘటన ములుగు మండలం కొట్యాల గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం... గ్రామస్తులు గొల్లోల్ల మత్తడి కుంట సమీపంలో వెళ్తుండగా గుర్తు తెలియని మృతదేహం నీటిలో తేలియాడుతూ కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా మృతదేహాన్ని బయటకు తీసి గజ్వేల్ ప్రభుత్వ మార్చురీకి తరలించారు. కాగా మృతుడి వయస్సు 50 నుంచి 60 ఏళ్ల మధ్య ఉంటుందని, ఛామన చాయ రంగు, ఒడ్డుపై మాత్రం మెరూన్ రంగు గల షర్టు, నీలి రంగు డబ్బాల లుంగీ ఉన్నాయని తెలిపారు.

ఆనంద్ గార్డెన్ సమీపంలో...

నర్సాపూర్: గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. స్థానిక ఎస్ఐ లింగం వివరాల ప్రకారం... నర్సాపూర్ – సంగారెడ్డి మార్గంలోని ఆనంద్ గార్డెన్ సమీపంలో రోడ్డు పక్కన మృతదేహం కనిపించగా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మార్చురీలో భద్రపర్చారు. అనారోగ్య సమస్యలతో చనిపోయి ఉంటాడని, మృతుడి వయస్సు 40 నుంచి 45 సంవత్సరాలు ఉండొచ్చని ఎస్ఐ తెలిపారు. మృతుడి ఒంటిపై చొక్కా లేదని, నల్ల రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని, కుడి చేతికి ఎర్ర రంగు ధారం ఉందని తెలిపారు.

సంగారెడ్డి పట్టణంలో..

సంగారెడ్డి క్రైమ్: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పట్టణ సీఐ రమేష్ వివరాల ప్రకారం ... స్థానిక మహబూబ్‌సాగర్ చెరువు కట్ట పరిసర ప్రాంతంలో గురువారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి(50) మృతదేహం ఉందని చాపలు పట్టే జాలరులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిందని, ఒంటిపై నీలం రంగు టీ షర్ట్, బూడిద రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం, ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వెంట పడుతున్నాడని.. చంపేశారు

- మద్యం తాగించి కొట్టిన వైనం
- నిందితుల రిమాండ్
- వివరాలు వెల్లడించిన త్రీటౌన్ సీఐ


వివరాలు వెల్లడిస్తున్న త్రీటౌన్ సీఐ విద్యాసాగర్

సిద్దిపేటఅర్బన్: అడ్డా కూలీని కొట్టి చంపిన హత్య కేసులో పోలీసులు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈనెల 8న రంగధాంపల్లి పరిధిలోని మయూరి దాబా వెనక ఖాళీ స్థలంలో బోదాసు నర్సింహులు హత్యకు గురైన విషయం తెలిసిందే. గురువారం పోలీస్ స్టేషన్‌లో త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ కేసు వివరాలు వెల్లడించారు. పట్టణంలో నివాసం ఉండే గ్యాదరి శ్రీదేవికి పెద్దపల్లి జిల్లా రత్నాపూర్‌కు చెందిన ఇట్టవేని సతీష్‌తో కల్లు దుకాణంలో పరిచయం ఏర్పడింది. ఇద్దరు చనువుగా ఉంటున్నారు. ఇదే క్రమంలో తొగుట మండలం పెద్ద మాసాన్‌పల్లికి చెందిన నర్సింహులు సైతం శ్రీదేవికి పరిచయం కాగా వెంటడేవాడు. దీంతో శ్రీదేవి విషయాన్ని సతీష్‌తో చెప్పింది. ఓ రోజు మద్యం తాగుతున్న సమయంలో శ్రీదేవికి సతీష్ పెళ్లి ప్రతిపాదన చేయగా ఒప్పుకుంది. కానీ, నర్సింహులు వెంట పడుతుండటంతో అతడిని అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల 7న రాత్రి సిద్దిపేట పాత బస్టాండ్ వద్ద శ్రీదేవిని నర్సింహులు కలిసి కల్లు తాగుదామని పిలిచాడు.అదే సమయంలో సతీష్ కూడా వచ్చాడు. రంగధాంపల్లి వద్ద దావత్ ఉందని ముగ్గురం కలిసి వెళ్దామని నర్సింహులును శ్రీదేవి నమ్మించింది. అక్కడి నుంచి వెళ్లి ముగ్గురు కలిసి మద్యం తాగారు. పథకం ప్రకారం గొడవపడి సతీష్ నర్సింహులును ఛాతీపై, ముఖంపై పిడి గుద్దులు గుద్ది, తల వెనక భాగంలో కొట్టగా మృతి చెందాడు. కేసును ఛేదించిన త్రీటౌన్ సీఐ విద్యాసాగర్, సిబ్బందిని ఏసీపీ రవీందర్‌రెడ్డి అభినందించారు.

షేర్ మార్కెట్ పేరుతో సైబర్ మోసం

తూప్రాన్: షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెడితే లాభాలు వస్తాయని నమ్మబలికిన సైబర్ నేరగాళ్లు వ్యక్తి నుంచి రూ.లక్ష కాజేశారు. ఎస్ఐ శివానందం కథనం ప్రకారం... పట్టణానికి చెందిన వ్యక్తి ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. గత నెల 13న తన ఫోన్‌కు టెలిగ్రాం ద్వారా హర్ష్ భగత్ అనే గ్రూపులో షేర్ మార్కెట్ గురించి మేసేజ్ వచ్చింది. ఇందులో రూ.10 వేలు పెట్టుబడి పెడితే రూ.75 వేల లాభం వస్తుందని మేసేజ్ పెట్టారు. దీనికి ఆకర్షితుడైన ఆ వ్యక్తి తన బ్యాంకు ఖాతా ద్వారా రూ.10 వేలు పంపించాడు. వెంటనే ఫోన్‌కు రూ.99 వేలు వచ్చాయని ఫొటో పంపించారు. పలు దఫాలుగా రూ.19 వేలు, జీఎస్టీ కోసం మరో రూ.29 వేలు పంపమని కోరడంతో నిజమేనని నమ్మి పంపించాడు. సేవింగ్ ఖాతా ఉంటే డబ్బులు తీసుకోలేరని, కరంటు అకౌంట్ ఉంటేనే తీసుకోవచ్చని సూచించారు. వారు చెప్పినట్లుగానే రూ.40 వేలు పంపించాడు. మరికొన్ని డబ్బులు పంపించాలని చెప్పడంతో మోసపోయానని గ్రహించి సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నంబర్ 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేశాడు.

వందరోజుల కార్యాచరణ అమలు చేయాలి

- ఎస్‌హెచ్‌జీ మహిళలకు రూ.కోటి చెక్కు అందజేత
- సీడీఎంఏ కార్యాలయం అదనపు డైరెక్టర్ గిరిశ్రీవాస్తవ


సదాశివపేట పట్టణంలో ఎస్‌హెచ్‌జీ మహిళలకు కోటి రూపాయల చెక్కును అందజేస్తున్న అడిషనల్ డైరెక్టర్ గిరిశ్రీవాస్తవ


గాంధీచౌక్ వద్ద పబ్లిక్ టాయిలెట్‌ను పరిశీలిస్తున్న గిరిశ్రీవాస్తవ, మున్సిపల్ అధికారులు

సదాశివపేట(సంగారెడ్డి): మున్సిపాలిటీ ప్రగతి పారిశుద్ధ్యం మెరుగు పరచడంతోపాటు పట్టణాల రూపురేఖలు మార్చేందుకు ప్రభుత్వం చేపట్టిన వందరోజుల కార్యాచరణ ప్రణాళికను అధికారులు పకడ్బందీగా అమలు చేయాలని సీడీఎంఏ కార్యాలయం అదనపు డైరక్టర్ గిరిశ్రీవాస్తవ అధికారులను సూచించారు. మున్సిపల్ డీఎంఏ ఆదేశాల మేరకు గిరిశ్రీవాస్తవ, రిటైర్డ్ కమిషనర్ ఇస్హాక్ అబ్‌ఖాన్ గురువారం మున్సిపల్ పరిధిలో పర్యవేక్షించారు. పట్టణంలో ఊబచెరువుపై అమృత 2.0లో భాగంగా మొక్కలు నాటి, గాంధీచౌక్ వద్ద ఉన్న పబ్లిక్ టాయిలెట్‌ని పరిశీలించారు. అనంతరం శాస్త్రీరోడ్‌లోని దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి ట్రేడ్ లైసెన్స్‌లను తనిఖీ చేశారు. వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను పర్యవేక్షించారు. అనంతరం ఎస్‌హెచ్‌జీ మహిళలకు రూ.కోటి చెక్కును అందజేశారు. మహిళలు రుణాలను సద్వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జే.ఉమా, ఏఈ రాజేశ్‌కుమార్, మేనేజర్ ఉమిందర్‌సింగ్, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, పర్యావరణ అధికారి అశోక్, సీఓ రమాదేవి, ఎస్‌హెచ్‌జీ మహిళలు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.